
# అందమె ఆనందం!



రచన : "ఓంశివ"

సాయంసమయం! అలవాటు ప్రకారం యేటి ఒడ్డునవున్న శాంతివనంలో ప్రశాంతతకోసం ఒక బెంచిమీద చతికిల పడ్డాను. పగలంతా పని ఒత్తిడితో అలసిన సూరీడు, విశ్రాంతికోసం నాలాగే పడమటి కనుమల నాశ్రయించాడు.

ఉదయభానుని లేత కిరణాల తాకిడికే తట్టుకోలేక పరుగిడిన చీకటి, భానుడు అలసిన సమయం చూచి దెబ్బకొట్ట గలిగానన్న సంతోషంతో నెమ్మదిగా పరిసరాలను ఆవరించ సాగింది. కానీ దానికి తెలియదు. మరుసటి దినాన 'ఉషోదవేళ' తన ఉనికి ఒక లేతకిరణం ఎర్రని క్రాంతికే చెప్పుతింటుందని. అంతవరకు ఎందుకు? 'నేను చాలనా!' అంటూ పసిపిల్లల మామ, పడచువాళ్ళలో గుబులు పుట్టించే 'చందమామ' శరదృతువు నెంటబెట్టుకొని 'తార'లతో, సరసాలాడుతూ కన్నెల కనులనింపే కలలు రేపుతూ చిరునవ్వుల సవ్వడితో వస్తున్నాడు.

చంద్రుని చూచిన సన్నజాజులు కేరింతలు కొడుతూ, తన పూరెక్కల నిప్పుచున్నవి. అది గమనించిన శారదా నదిపైని గాలి కెరటం దానిని తాకి, ఆ ఉత్సాహంతో నన్నూ డీకొట్టింది. ఆ ప్రకృతికి మరింత వింతసోయగాన్ని చేకూర్చుతున్నట్లుగా ఎక్కడినుండో, 'సిరివెన్నెల' గీతం 'ఈ గాలీ, ఈ నేల, ఈ ఊరు, సెలయేరు' సన్నగా వినిపిస్తుంది.

నా ఆలోచనా తరంగాలకు అడ్డు తగులుతున్నట్లుగా పార్కులోని లైటు ఒకసారిగా వెలిగాయి. అప్పుడు పడింది నా దృష్టి ఎదురుగా ఒక పొద దగ్గరగానున్న బెంచిపై గల వసంత సొగసుల వయ్యారిపై. లేత నీలిరంగు వోణీ, తెల్లని రవిక, చేతిలో ఏదో పుస్తకం, చక్కని కనుముక్కుతీరు, శరదృతువు వెన్నెలలో వసంతం కంబోసినట్లుగా వుంది, ఆమె నక్కడ చూడటం.

నేటి నవలా సాహిత్యంలో తనదైన బాణీతో వ్రాసిన 'యండమూరి' 'అభిలాష' చదివినప్పుడు కలిగిన ఉద్వేగం ఆమెలో కనిపిస్తుంది. ఆ టెన్సన్‌తో, గట్టిగా ఊపిరిపీల్చి వదలడం వలన ఎగిసి ఎగిసి పడుతున్న ఆమె స్థనద్వయం వింతసోయగాలను కురిపిస్తూంది.

'ఛ ఛ...ఏమిటిది? ఆడపిల్ల కనబడితే బుర్రవంచుకొని పోయే తనేనా? అలా చూస్తుంది. ఈ రోజు తనకేమైంది. తప్పు అలా చూడకూడదు' అని నిశ్చయించుకొని ప్రక్కకు బుర్ర తిప్పాను. పార్కులో పెద్దగా జనసంచారం లేదు. పైనుండి నెమ్మదిగా మంచుపడినా లేని వేడిని పైకి తీసుకొస్తుంది దానికి తోడు.

ఈ సంవత్సరం బాగా కురిసిన వర్షాలవలన నిండుగా పారుతున్న నది పైనుండి వీచిన పిల్లగాలులు నాలోని ఉద్వేగభరితమైన మనస్సుకు మరింత ఉద్వేగం చేకూర్చుతున్నాయి.

ఎంత మనస్సు మరలించుదామన్నా, అది నా మాట వినడంలేదు. సృష్టిలోనున్న అందాన్ని ఆస్వాదించటం మానవునికున్న ఏకైక బలహీనతేమో! ఆమె నన్ను గమనించడంలేదు. అదేపనిగా నవల చదువుతుంది. ఇంత అందమైన చల్లని రేయి, మరింత అందమయిన 'జీవరా

THERE IS JOY
WHERE THERE IS

HIGH PRESSURE WATER SYSTEM




JOTHI
Engineering Works
INDUSTRIAL ESTATE,
MADURAI — 625 007.

—ATHMAS

లని' చూడగలగడం నిజంగానే చాలా ఆనందంగా నుంది. నాలో ఏదో మూల దాగున్న కవి హృదయం ఆమెను పరీక్షించ సాగింది.

స్వచ్ఛమయిన గులాబి వన్నెల బుల్లి పెదాలపై నాట్యం చేస్తూన్న చల్లని పాల సురగలాంటి ఆ నవ్వు, లేపాక్షి అందాలను మరిపించే ఆ అందం, పిల్లగాలులతో చెలగాటలాడే ఆ ముంగిరులు, కవుల కవిత కందని ఈ అందం, ఎక్కడో, ఎక్కడో చూసినట్లనిపించింది. ఎక్కడ చూసానా అని, నా మనస్సు పొరలలో వున్న గతం జ్ఞాపకస్మృతులలోకి చొచ్చుకుంటూ, నా భావప్రకంపనలు సాగాయి. ఆవిచిప్పలాంటి ఆ కన్నులను పుష్పలావణ్యాన్ని మరిసించే ఆ సొగసులను, ఎక్కడ చూశానా నన్ను నా తలపు! ఆమె ఎవరో తెలుసుకోవాలన్న ఆతృతతో నిండిన నా మనోరథం అభీష్టమేరకు ఆమెను మరింతగా వీక్షించడానికి, పరీక్షించడానికి కొద్దికొద్దిగా ముందుకు నాకు తెలియకుండానే నా కాళ్ళు నడిచాయి.

ఆమెను సమీపించే లోపలే నా మస్తిష్కంలో మెరుపులాంటి తలపు, తలంపు...ఆ...ఆమే! ఆమే నా చిననాటి నేస్తం! నా కలల ఊర్వశి! నా పద్మ!

ఆమెను పోల్చుకోగలిగాను! ఎంతటిలో ఎంత మార్పు! అవును మరి! ఆమె, నేను విడిపోయి ఆరు వసంతాలు నిండాయి.

దగ్గరగా వెళ్ళి నిలుచున్న నన్ను, తలెత్తి చూసింది... ఒక అర నిమిషము మా నాలుగు కళ్ళు కలుసుకున్నాయి. ఆమెలో ఒక్కసారి ఆనంద తరంగ ప్రకంపనలు...లేత గులాబీ పెదవులు విడివడి...తెల్లని...చల్లని నవ్వులు కురిపిస్తున్నాయి.

“హలో! నీవేనా రవి! ఎన్నాళ్ళయింది నిన్ను చూచి ఎలా వున్నావు?” అంది నవ్వుతూ.

“ఆ బాగానే వున్నాను! చానాళ్ళకు కలిశాం! ఎలా వున్నావు? ఇంటిలో అంతా కులాసేయేనా?”

“ఆ బాగానే వున్నారు! ఎంత మారిపోయావు రవీ! ఎంత చిక్కిపోయావు, చిన్నప్పటినుంచీ కలిసి తిరిగిన మనం, చాలా రోజులు విడిగా బ్రతకవలసి వచ్చింది కదూ! అప్పటికీ, ఇప్పటికీ ఏం మార్పులేదు కదూ మన ఊరు!

మనం ఆడుకున్న ప్రదేశాలన్నీ అలాగే ఉన్నాయా!" మా నాన్నగారికి ట్రాన్సఫర్ అయ్యాక ఈ వూరు వదలక తప్పింది కాదుగానీ, లేకపోతే ఇక్కడే వుండాలనిపించేది నా కెప్పుడూ" అంటూ గలగల సెలయేటిలాగ తన సహజ దోరణిలో చెప్పుకుపోతుంది.

ఆ ప్రవాహానికి అడ్డు లేకపోతే నేను కొట్టుకుపోవలసిందే! అప్పటికీ, ఇప్పటికీ ఏం మార్పులేదు. అంటే... అంటే! నా పద్మ ఎప్పటికీ అలాగే వుందన్నమాట! నాలో వున్న కోరికకు రెక్కలొచ్చినట్లు అయింది.

"నేను ఇక్కడే చిన్న వర్కుషాపులో ప్రస్తుతం పని చేస్తున్నాను. L M E అయింది కదా! A.M.I.L. కడదామనుకుంటున్నాను. అది సరేకాని మళ్ళీ మీరంతా ఇక్కడికి వచ్చేసారా!" అంటూ ఆమె మాటల కడ్డుతగిలాను.

"లేదు! సరదాగా నిన్ను చూచిపోదామనే వచ్చాను. చిన్నప్పటినుంచీ, నాతో పాటు పెరిగిన నా అభిలాషను తీర్చగలిగే దేవత నా ఎదుటనే వుంది. ఆమె మరొక ఊరు వెళ్ళిన తరువాత మా మధ్య ఉత్తర ప్రత్యుత్తరాలు కొద్దికాలం నడిచాయి. తరువాత ఎందుకనో ఆగిపోయాయి. అయినా నేను రెండు మూడు ఉత్తరాలు రాశాను. కాని అవి గోడకు విసిరిన బంతిలాగ నా దగ్గరికే వచ్చిపడ్డాయి. తరువాత తెలిసింది వాళ్ళు వూరు మారారని!

ఆరు సంవత్సరాల అనంతరం మళ్ళీ ఇదిగో ఇదే పునః దర్శనం. నాకు చిన్నప్పటినుంచీ పద్మ అంటే ఎంతో అభిమానం. అమ్మ నా కోసం దాచిన చేగోడీలు, అదీ తీసుకొని, ఇదిగో ఈ ఏటి ఒడ్డునే తినేవాళ్ళం. నేను పేదవాడిననీ, నాతో స్నేహం మానమని వాళ్ళింటిలో ఎంత పోరినా పద్మ నన్ను విడిచి వుండేది కాదు! నాతోనే స్నేహం! దానికి నేను బాగా చదవడం ఒకటే కారణం కాకపోవచ్చు! మా యింటి దగ్గరే పద్మ వాళ్ళ ఇల్లు! కొద్దిగా ఎదిగిన తరువాత నా అభిమానం ప్రేమగా రూపుదిద్దుకొంది. కాని నాది వన్‌వే ట్రాపిక్ అనుకొంటూ...

అలాగే పద్మ కళ్ళలోకి చూస్తూ ఆలోచనలలో మునిగి



వున్న నన్ను చూచి,

''ఏమ్ మహానుభావా! ఇంకా నీ అలవాటు పోలేదా!'' మాట్లాడుతూ, మాట్లాడుతు ఆలోచనలలో మునుగుతావు'' అంది.

నేను తేరుకొని 'అబ్బే అదేంలేదు' అంటూ మళ్ళీ సంభాషణ ప్రారంభించాను.

ఎలాగైనా నా మనస్సులోని కోరిక బయటపెడదామనుకున్నంతలో ఒక వ్యక్తి మా వైపుకు రావడం గమనించాను. అతను మంచి అందంగా, హుందాగా, టిప్‌టాప్‌గా వున్నాడు. అతనిలో ఒక విధమైన ఠీవి గోచరిస్తుంది. ఇతనెవరబ్బా? అనుకుంటున్నంతలో అతను మమ్మలను సమీపించాడు.

''సారీ! పద్మా డియర్! కొద్దిగా ఆలస్యమైనట్లుంది'' అన్నాడు పద్మను చూస్తూ.

నా గుండె ఒక్కసారిగా ఆగి మళ్ళీ కొట్టుకోవడం ప్రారంభమయింది. నేను ఆశ్చర్యంనుండి తేరుకొనక ముందే పద్మ, నాకు అతనిని పరిచయం చేసింది.

''ఇదిగో రవి ఇతనే మా ఆయన! పేరు మురళీకృష్ణ! హైదరాబాద్ బెల్‌లో ఇంజనీరుగా చేస్తున్నారు. పెళ్ళిక్రింద ఉేడే గాభరా గాభరాగా జరగటం మూలాన మిమ్మల నెవరినీ పిలవడానికి వీలులేక పోయింది'' అంది.

ఉభయ పరిచయాలు పూర్తయ్యాయి. నా గుండెలో అగ్ని శిలలు బ్రద్ధలైనట్లువా ఫీలింగ్! అంత చల్లని వెన్నెల కూడా మే మాసంలో మిట్ట మధ్యాహ్నం ఎండలా కనిపించింది. అప్పుడు గమనించాను ఆమె కాళ్ళకి వున్న మెట్టెలని...

''ఈ ఊరులో ఈయన ఫ్రెండ్ పెళ్ళంటే వచ్చాం! ఉదయాన్నే వచ్చి, ముందు మీ ఇంటికే వెళ్ళాం! నీవులేవు. మీ అమ్మ వుంది. రాత్రి పెళ్ళి సాయంత్రం ఏమీ తోయక ఇక్కడి కొచ్చాను'' అని ఏదేదో చెబుతుంది. అవేమీ నా బుర్ర కెక్కడంలేదు. అప్పటివరకూ ఆహ్లాదంగా వున్న వాతావరణం పూర్తిగా మారిపోయినట్టయింది.

మర్యాద కోసం వాళ్ళను మా యింటి కాహ్వానించాను మళ్ళీ. కాని పద్మ ''నిన్ను చూశాంగా! రాత్రి పెళ్ళి చూచుకొని ఉదయాన్నే వెళ్ళాలి. మరి ఈసారి అవదు. మళ్ళీ నీ పెళ్ళికొస్తాంగా'' అంది నవ్వుతూ.

నేను అక్కడ ఒక్కక్షణం కూడా నిలవలేకపోయాను! వాళ్ళ దగ్గర సెలవు తీసుకొని, పనిలేకపోయినా వడివడిగా అడుగులేస్తూ ఇంటివైపు కదిలాను.

ఎక్కడనుంచో ''అందమయిన జీవితం! అద్దాల సౌధమూ'' అని మూగగా ఎవరో రోధిస్తున్నట్లుగా వినిపిస్తుంది. ఆ పాటంటే నా కెంతో ఇష్టమైనా ఆ క్షణం అది వినడం చాలా కష్టమనిపించింది.




మేలైన పొగాకుతో, అత్యుత్తమమైన ఆకులతో, నిపుణులైన పనివారలచే తయారు చేస్తున్నాము

✳

మల్లిస్సేరీ బీడీలు

✳

అత్యుత్తమమైనదని లక్షలాది ప్రజలు వాడుచున్నారు

Grams : "Mallisseri"

Phone : 24031

**Malliseri Beedi Works**

SULLIVAN STREET :: COIMBATORE-641 00'.